యువత దేశభక్తిని పెంపొందించుకోవాలి



జాతీయ పతాక ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ అరవింద బాబు, రోటరీ ప్రతినిధులు



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



విద్యుత్ వెలుగులలో రొంపిచర్ల తహసీల్దార్ కార్యాలయం



గణపవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



దేశనాయకుల వేషధారణలో గీతాంజలి విద్యార్థులు



గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

నరసరావుపేట ఈస్ట్: భారతదేశ ఘనతను ప్రపంచం నలుమూలలా చాటేలా యువత కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. నరసరావుపేట రోటరీక్లబ్, వాగ్దేవి విద్యాసంస్థల ఆధ్వర్యంలో బుధవారం 78వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని భారీ జాతీయ పతాకంతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ అరవింద బాబు మాట్లాడుతూ, నేడు ప్రపంచం యావత్తు భారతదేశం వైపు చూస్తున్నదని వివరించారు. పల్నాడు రోడ్డులోని పాలకేంద్రం వద్ద నుంచి బయలుదేరిన ర్యాలీ గడియార స్తంభం సెంటర్ మీదుగా ఆర్డీఓ కార్యాలయం వరకు కొనసాగింది. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు కపలవాయి రాజేంద్రప్రసాదు, రోటరీ ప్రతినిధులు కె.పి.రంగారావు, తాళ్ల రాజశేఖరరెడ్డి, ఎం.సుమిత్ర కుమార్, షేక్.జిలానీమాలిక్, వాగ్దేవి విద్యాసంస్థల డైరెక్టర్లు రాయల శ్రీనివాసరావు, కాట్ల రామకోటేశ్వరరావు, ఓగూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర స్ఫూర్తిని చాటుదాం

వినుకొండ(నూజెండ్ల): బీజేపీ ఆధ్వర్యంలో పట్టణంలో హర్ ఘర్ తిరంగా యాత్ర బుధవారం ఘనంగా నిర్వహించారు. 500 అడుగుల జాతీయ జెండాతో వెన్నల సూపర్ మార్కెట్ నుంచి మున్సిపల్ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ దేశభక్తిని అలవర్చుకోవాలని సూచించారు. దేశ స్వాతంత్య్రం కోసం పోరాడిన దేశ నాయకుల అడుగుజాడల్లో నడవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేడం రమేష్, జనసేన సమన్వయకర్త నాగశ్రీనురాయల్, నిశ్శంకర శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర దినోత్సవ సొబగులు

రొంపిచర్ల: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పాఠశాలల్లో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. గురువారం నిర్వహించే స్వాతంత్య్ర దినోత్సవానికి కార్యాలయాలన్నీ ముస్తాబయ్యాయి. వాటిని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

శావల్యాపురం: స్థానిక ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. హెచ్ఎం సి.హెచ్.చెంచులక్ష్మి మాట్లాడుతూ ప్రాథమిక దశ నుంచి విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించటానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతోగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మేరి పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో విజేతలు వీరే

రొంపిచర్ల: స్థానిక భగత్ సింగ్ భవన్‌లో స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 13న విద్యార్థులకు నిర్వహించిన మండల స్థాయి వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విజేతల వివరాలను నిర్వహణ కమిటీ సభ్యులు బుధవారం వెలువరించింది. ఈ సందర్భంగా భగత్‌సింగ్ భవన్ నిర్వహణ కమిటీ ముఖ్య కార్యదర్శి ఎస్.రామకృష్ణం రాజు మాట్లాడుతూ ఈ నెల 13న విద్యార్థులకు నిర్వహించిన మండల స్థాయి వ్యాసరచన పోటీలలో రొంపిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి కల్లి శ్రీ విద్య ప్రథమ బహుమతి, గోగులపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన గోనుగుంట్ల రామతులసి ద్వితీయ బహుమతి, ఎన్.కృపారాణి తృతీయ బహుమతులకు ఎంపికయ్యారు. గోగులపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థినులు కె.ద్వారక, జె.శివనాగమణి, రొంపిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థినులు ఆర్.భవ్యశ్రీ, ఎస్.కె.షిఫా, సంతగుడిపాడు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం 10వ తరగతి విద్యార్థినీ జి.త్రివేణి కన్సోలేషన్ బహుమతులకు ఎంపికయ్యారన్నారు. వ్యాసరచన పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు, వారికి సహకరించిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 15న వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విజేతలకు వారి పాఠశాలలకు వెళ్లి బహుమతులు అందజేస్తామని అన్నారు.

800 మంది విద్యార్థులతో ర్యాలీ

నాదెండ్ల: గణపవరం శ్రీకెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం 365 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. 800 మంది విద్యార్థులతో ఉన్నత పాఠశాల నుంచి గ్రామంలోని బొడ్డురాయి సెంటర్ వరకూ ఎన్‌సీసీ క్యాడెట్‌లు బ్యాండ్‌తో ర్యాలీ జరిగింది. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణానాయక్ మాట్లాడుతూ దేశ స్వాతంత్య్రం కోసం లక్షలాది మంది మహనీయులు సర్వస్వం ధారపోశారన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే జాతీయ భావాలను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ ఎండీ రసూల్, పీడీ వేణుగోపాల్, పీఈటీ శ్రీకాంత్, ఉపాధ్యాయులు శ్రీనునాయక్, భరత్, సాంబశివరావు, సుధాకర్, వై శ్రీనివాసరావు, ఆర్.కోటేశ్వరరావు ఉన్నారు.

స్వాతంత్య్ర దినోత్సవ సంబరాలు

వినుకొండ(నూజెండ్ల): స్వాతంత్య్ర దినోత్సవ సంబరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక గీతాంజలి స్కూల్‌లో నిర్వహించిన వేడుకల్లో ప్రిన్సిపాల్ తేళ్ల కృష్ణవేణి ప్రతి ఒక్క విద్యార్థి జీవితంలో ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని దేశం గర్వపడే పౌరులుగా ఎదగాలని, భారతదేశ ఔన్నత్యాన్ని గుర్తించి దేశం యొక్క కీర్తిని నలుమూలల వ్యాపింపజేసి భారతమాత రుణం తీర్చుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యాసంస్థల కరస్పాండెంట్ వై.ఎల్.కిషోర్ పాల్గొన్నారు.

ఎన్‌సీసీ సైకిల్ ర్యాలీ



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్స్

నరసరావుపేట రూరల్: 78వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా నినాదంతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. జాతీయ జెండాలతో 50 మంది ఎన్‌సీసీ క్యాడెట్స్ ర్యాలీలో పాల్గొన్నారు. వందేమాతరం అంటూ యల్లమంద గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, ఎన్‌సీసీ అధికారి మేడికొండ రాజేష్‌బాబు పాల్గొన్నారు.

ఘర్ ఘర్‌కీ తిరంగా ర్యాలీ



నాటికను ప్రదర్శిస్తున్న మోడల్ స్కూల్ విద్యార్థులు

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెంలో గల ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాల విద్యార్థులు బుధవారం ఘర్ ఘర్‌కీ తిరంగా పేరున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీలో విద్యార్థులు, ఉపాధ్యాయులు చేసిన నినాదాలు గ్రామస్తులను ఆకట్టుకున్నాయి. నాలుగు రోడ్ల కూడళ్లలో విద్యార్థులు మానవ హారం ఏర్పాటు చేశారు. స్వాతంత్య్ర ఉద్యమంపై ప్రదర్శించిన లఘు నాటిక గ్రామస్తుల్లో స్వాతంత్రోద్యమ స్ఫూర్తిని నింపింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రవినాయక్, పాఠశాల ఉపాధ్యాయుల, విద్యార్థులు పాల్గొన్నారు.

వివిధ విభాగాల్లో విద్యార్థులకు పోటీలు

చిలకలూరిపేటటౌన్: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో బుధవారం జనవిజ్ఞాన వేదిక, షేక్ లాలుదాదా సాహెబ్ సేవ సమితి సంయుక్త ఆధ్వర్యంలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, చిత్ర లేఖనం, వేషధారణ, దేశభక్తి గేయాలు పోటీ నిర్వహించి బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అర్బన్ సీఐ రమేష్ హాజరై బహుమతులు అందజేశారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు తేళ్ల సుబ్బారావు, లాలూదాదాసాహెబ్ సేవ సమితి అధ్యక్షులు సిద్దాంతి కరిముల్లా, ఆర్యవైశ్య కల్యాణ మంటపం అధ్యక్షులు చేవూరి కృష్ణ మూర్తి, జేవివి పల్నాడు జిల్లా అధ్యక్షులు దార్ల బుజ్జి బాబు, ఇంచార్జ్ గ్రంథపాలకులు నాగుల్‌మీరావలి, లైబ్రరీ సిబ్బంది పాల్గొన్నారు.

దేశభక్తి గేయాలపై పోటీలు

నరసరావుపేట రూరల్: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో పల్నాడు బాలోత్సవాల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం దేశభక్తి గేయాలపై పోటీలు నిర్వహించారు. పట్టణ పరిధిలోని ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల నుంచి 200 మంది విద్యార్థులు పోటీలో పాల్గొన్నారు. పోటీలో విద్యార్థులు ఆలపించిన దేశభక్తి గేయాలు అలరించాయి. సోలో, జూనియర్, సీనియర్ అన్ని విభాగాల్లో ఐగ్రో ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారు. సెయింట్ జోసఫ్ స్కూల్, శంకర భారతీపురం హైస్కూల్, ఆక్స్‌ఫర్డ్ స్కూల్, టైనీటాట్స్ హైస్కూల్ ద్వితీయ బహుమతిని, ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్, టైనీటాట్స్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు తృతీయ బహుమతిని సాధించారు. పల్నాడు బాలోత్సవాల అధ్యక్షులు సీహెచ్ రాజగోపాల రెడ్డి, న్యాయవాది మోదుగుల ఆరోగ్యం చౌదరి, కమిటీ సభ్యులు షేక్ మస్తాన్ వలి, భాగేశ్వరి దేవి, శివపార్వతి, డి.శివకుమారి పాల్గొన్నారు.

జాతీయ జెండాలతో ర్యాలీ



చిలకలూరిపేటటౌన్: హర్‌ఘర్ తిరంగ అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు జెండా ఊపి ప్రారంభించారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమం పట్టణంలోని ఆర్‌వీఎస్ సీవీఎస్ హైస్కూల్ వద్ద నుంచి ప్రారంభమై చౌత్రాసెంటర్, రిజిస్టర్ కార్యాలయం మీదుగా ఎన్ఆర్‌టీ సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి తిరిగి రిజిస్టార్ కార్యాలయం వద్దకు చేరుకుని నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి అందరూ జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తాటిపర్తి జయరామిరెడ్డి, జనసేన నాయకులు తోట రాజారమేష్, రెండు పార్టీల నాయకులు, హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి లెనిన్ భార్య శ్రీలక్ష్మి మృతి

వినుకొండ(నూజెండ్ల): భారతీయ జనతా పార్టీ(బీజేపీ) వినుకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి యార్లగడ్డ లెనిన్‌కుమార్ భార్య శ్రీలక్ష్మి అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఆమె మృతికి పలువురు బీజేపీ, టీడీపీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు నరసరావుపేట రోడ్డులోని జైకృష్ణ అపార్ట్‌మెంట్ వద్ద నుంచి అంతిమయాత్ర ప్రారంభమవుతుందని కుటుంబసభ్యులు తెలిపారు.

క్లుప్తంగా

ఎస్ ఎస్ అండ్ ఎన్ కళాశాల ప్రిన్సిపల్‌గా డాక్టర్ సుధీర్

నరసరావుపేట ఈస్ట్: శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల నూతన ప్రిన్సిపల్‌గా డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, వైస్‌ప్రిన్సిపల్‌గా డాక్టర్ పి.శ్రీనివాససాయి నియమితులయ్యారు. కళాశాల పాలక వర్గ అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త, పాలకవర్గ సభ్యులు ఈమేరకు నిర్ణయించారు. కళాశాలలో కెమిస్ట్రీ అధ్యాపకునిగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న డాక్టర్ ఎం.ఎస్.సుధీర్ వైస్‌ప్రిన్సిపల్‌గా, ఇంటర్మీడియేట్ ఇంటెన్సివ్ క్యాంపస్ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అలాగే వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాససాయి గణితశాస్త్ర అధ్యాపకునిగా, నాక్ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నారు.

ఎంపీడీఓ హనుమారెడ్డి బాధ్యతలు స్వీకారం

యడ్లపాడు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బదిలీపై వెళ్లిన ఎంపీడీఓ తిరిగి సొంత మండలానికి వచ్చారు. యడ్లపాడు ఎంపీడీఓగా పనిచేస్తున్న వై.హనుమారెడ్డి ఎన్నికల విధులు నిమిత్తం ప్రకాశం జిల్లా బల్లికురవ మండలానికి వెళ్లగా, అదే జిల్లాలోని మద్దిపాడు మండల ఎంపీడీఓ వై.శ్రీనివాసరావు ఇక్కడకు వచ్చారు. ఎన్నికల ప్రక్రియ పూర్తి కావడంతో అధికారులు తమ సొంత మండలాలకు బదిలీలు కావాలంటూ ఉత్తర్వులు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఈనెల 9న వై.శ్రీనివాసరావు ప్రకాశం జిల్లాకు వెళ్లగా, అక్కడ పనిచేస్తున్న వై.హనుమారెడ్డి 10వ తేదీన తిరిగి యడ్లపాడు మండల ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టారు.

హోంగార్డు కుటుంబానికి చేయూత

నరసరావుపేట: పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తూ మృతిచెందిన, పదవీ విరమణ చేసిన వారికి సహాయం చేసేందుకు జిల్లా పోలీసులు ముందుంటారని జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ అనారోగ్య కారణం చేత మృతిచెందిన ఎం.రాజశ్రీకి హోంగార్డు యూనిట్ తరఫున రూ.5లక్షల ఆర్థిక సహాయాన్ని ఆమె కుమార్తె గాయత్రికి అందజేశారు. అదేవిధంగా హోంగార్డుగా 44 ఏళ్లపాటు విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన డి.సుబ్బమ్మను ఎస్పీ సన్మానించి తదుపరి జీవితం ఆయురారోగ్యాలతో ఉండాలన్నారు.

రాష్ట్ర ప్రతినిధులుగా పల్నాడు జిల్లా వాసులు ఎంపిక

నరసరావుపేట: తిరుపతి పట్టణంలో బుధవారం నిర్వహించిన ది వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్ ఆఫ్ ఏపీ నూతన కమిటీ ఎన్నికలో పల్నాడు జిల్లాకు చెందిన ఇరువురు రాష్ట్ర ప్రతినిధులుగా ఎన్నికయ్యారు. అసోసియేషన్ కార్యవర్గాన్ని ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అందులో పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన బొందిలి శ్రీనివాస్‌సింగ్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఎన్నిక కాగా, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా చిలకలూరిపేటకు చెందిన ఆవుల చంద్రకుమార్‌ను ఎన్నుకున్నారు. దీనికి సహకరించిన ఉమ్మడి గుంటూరు జిల్లా లైసెన్స్‌డ్ ఇంజనీర్స్ అండ్ సర్వేయర్స్ సంక్షేమ సంఘ అధ్యక్షులు కొమ్మసాని కమలాకరరెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

కొట్టుకొచ్చాడా..హత్య చేసి పడేశారా?

- పెదనందిపాడు కాల్వలో గుర్తుతెలియని యువకుడి మృతదేహం
- లింగారావుపాలెం గ్రామంలో ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన



ఒడ్డుకు చేరిన యువకుని మృతదేహం

యడ్లపాడు: తమ పిల్లవాడు కనిపించడం లేదని వెతుకులాడుతున్న వారికి గుర్తుతెలియని మృతదేహం కనిపించింది. సాగర్ (పీబీసీ) కాల్వలో ఒంటిపై నూలుపోగు లేకుండా ముళ్లకంపల్లో చిక్కుకుని పడిఉండటాన్ని బుధవారం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న యడ్లపాడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్న ఏఎస్‌ఐ ఎం ప్రభుదాసు జేసీబీ సాయంతో మృతదేహాన్ని వెలికి తీయించారు. మృతుడు సుమారు 35 ఏళ్ల వయస్సు ఉంటుందని ప్రాథమికంగా నిర్ధారించారు. శరీరమంతా ఉబ్బిపోయి ఎక్కడికక్కడ చర్మం ఊడిపోవడంతో వ్యాపించిన దుర్గంధంతో దగ్గరకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఆనవాళ్లు సరిగ్గా గుర్తు పట్టలేని విధంగా ఉండటంతో రెండు, మూడు రోజుల కిందట మృతి చెంది ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. స్థానిక వీఆర్వో కొండ ఆదిలక్ష్మి ఫిర్యాదుతో ఎస్‌ఐ వంకాయలపాటి బాలకృష్ణ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు యడ్లపాడు పోలీస్‌స్టేషన్‌కు లేదా ఎస్‌ఐ సెల్ నం: 94407 96256కు తెలియజేయాలని కోరారు.

భిన్నకోణాల్లో దర్యాప్తు

యువకుడు ఎక్కడైనా ఈతకు వెళ్లి పొరపాటున నీట మునిగాడా..లేదా ఎవరైనా హత్య చేసి కాల్వలో పడేశారా.. మృతుడు సమీప ప్రాంతాలకు చెందిన వాడా లేక సుదూర ప్రాంతాలకు చెందిన వాడా.. తదితర కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేసేందుకు సిద్ధం అవుతున్నారు. మృతుడి ఫోటోలను అన్ని పోలీస్‌స్టేషన్లకు పంపించి, అదృశ్యమైన వ్యక్తులకు సంబంధించిన వివరాలపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. మృతుడి వివరాలు, మృతికి కారణాలు పోస్టుమార్టం, పోలీసుల విచారణలో వెల్లడికావాల్సి ఉంది.

గ్రామాభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి

నాదెండ్ల: స్థానిక ప్రజాప్రతినిధులతో కలసి అధికారులు గ్రామాభివృద్ధికి తోడ్పడాలని ఎంపీడీఓ షేక్ జాకీర్‌హుస్సేన్ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 12 నుంచి పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు జరుగుతున్న శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్ మాట్లాడుతూ, గ్రామాభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలన్నారు.

యడ్లపాడు: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో సుపరిపాలన అందించే విధంగా ప్రణాళికలు తయారు చేసుకోవాలని ఎంపీడీవో వై.హనుమారెడ్డి చెప్పారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఆదేశాల మేరకు సర్పంచ్‌లు, కార్యదర్శులకు నిర్వహిస్తున్న మూడు రోజుల రిఫ్రెషర్ శిక్షణా కార్యక్రమం బుధవారంతో ముగిసింది. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఏవో సాయి శ్రీనివాస్, ఈవోపీఆర్డీ వరూధిని పాల్గొన్నారు.

బొల్లాపల్లి : గ్రామపంచాయతీ సర్పంచ్‌లు, పంచాయతీకార్యదర్శులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మూడు రోజుల శిక్షణా తరగతులు బుధవారంతో ముగిశాయి. శిక్షకులుగా పేరూరుపాడు, పలుకూరు పంచాయతీ కార్యదర్శులు పాండురంగారావు, బి.శ్యామలాదేవిలు వ్యవహరించారు.



మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో వసంతరాయుడు

నరసరావుపేట రూరల్: గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై సర్పంచ్‌లు దృష్టి సారించాలని జెడ్పీ సీఈవో వసంతరాయుడు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు జరుగుతున్న గ్రామ పంచాయతీ పునశ్చరణ శిక్షణా తరగతుల్లో బుధవారం ఆయన పాల్గొన్నారు.

మహిళా సాధికారితపై అవగాహన

రొంపిచర్ల: చదువు వల్లే ఆడపిల్లల్లో మానసిక స్థైర్యం సాధ్యమవుతుందని మహిళా శిశుసంక్షేమ శాఖ జిల్లా అధికారి ఉమారాణి అన్నారు. మండలంలోని సంతగుడిపాడు కస్తూర్బా గాంధీ పాఠశాలలో వంద రోజుల మిషన్ శక్తి సంకల్ప్ మహిళా సాధికారిక కార్యక్రమంలో భాగంగా బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆమె బాలకలనుద్దేశించి మాట్లాడుతూ బాగా చదువుకొని తమ కాళ్లమీద తాము నిలబడాలన్నారు. బాలికలకు 18 సంవత్సరాల లోపు వివాహాలు చేయరాదన్నారు. చిన్న వయస్సులో వివాహాలు జరిగితే సామాజికంగా, మానసికంగా నష్టపోతారన్నారు. అవసరమైతే చైల్డ్ హెల్ప్‌లైన్‌ను వినియోగించుకోవాలన్నారు. పోషక విలువలు గల ఆహారాన్ని తీసుకోవాలన్నారు. బాల్య వివాహాల నష్టాలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో ఉమామహేశ్వరి, కేజీబీవీ ప్రిన్సిపాల్ పి. బాలశౌరీలు, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు కె.శశిదేవి, డి.దేవీబాయి, ఎస్‌కే.షమీర్ సుల్తానా, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎంఎస్‌కే, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

హెచ్ఐవీ /ఎయిడ్స్ గురించి మీకు తెలుసా?

చిలకలూరిపేటటౌన్: హెచ్ఐవీ/ఎయిడ్స్ బాధితుల పట్ల సమాజం వివక్ష చూపరాదని ఐసీటీసీ కౌన్సిలర్ హనుమంతరావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు జిల్లా ఆరోగ్యశాఖ, ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం సహకారంతో బుధవారం హెచ్ఐవీ/ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పట్టణంలోని యానాదికాలనీ డైక్‌మెన్ ప్రాంగణంలో క్యాంప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ సందర్భంగా మీకు తెలుసా? పేరిటా వ్యాధిపై పూర్తి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో క్యాంపు ప్రాజెక్ట్ మేనేజర్ రోహిణి, ధనలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు కోటేశ్వరమ్మ, ఆశ వర్కర్ రాజేశ్వరి సిబ్బంది పాల్గొన్నారు.

లారీ దూసుకెళ్లి జీవాల మృత్యువాత



నాదెండ్ల: జాతీయ రహదారిపై గణపవరం రాజీవ్‌గాంధీకాలనీ వద్ద జీవాల మందపైకి లారీ దూసుకెళ్లటంతో నాలుగు గొర్రెలు మృత్యు వాతపడగా, మరో నాలుగు గాయాలపాలైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గణపవరం గ్రామానికి చెందిన అచ్చి ముత్యాలరావు జీవాలు మేపుకుని జీవిస్తుంటాడు. ఈ క్రమంలో సాయంత్రం 6 గంటల సమయంలో జీవాలు మేపుకుని తిరిగి ఇంటికి తోలుకెళ్తున్నాడు. జాతీయ రహదారి దాటుతుండగా చెన్నై నుంచి కలకత్తా వెళ్తున్న లోడు లారీ ఢీకొంది. దీంతో నాలుగు గొర్రెలు మృత్యువాత పడగా, మరో నాలుగు తీవ్రంగా గాయపడ్డాయి. వీటి విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని బాధితుడు వాపోయాడు. ప్రమాదానికి కారణమైన లారీని పోలీసులు నాదెండ్ల పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఎస్ఐగా ఉమామహేశ్వరరావు బాధ్యతలు స్వీకారం

ఈపూరు: స్థానిక పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా ఎం.ఉమామహేశ్వరరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న షేక్ మహమ్మద్ ఫిరోజ్ బదిలీలో భాగంగా దాచేపల్లి వెళ్లడంతో ఆయన స్థానంలో ఉమామహేశ్వరరావు ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించమన్నారు. అలాగే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలిగినా నేరుగా సంప్రదించవచ్చని కోరారు.

చివరికి మిగిలేది ఆరడుగుల నేలే!

- ఎంత సంపాదించినా ఏం ప్రయోజనం
- శ్మశానాల్లో సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తాం
- క్రైస్తవుల సమాధుల తోటను పరిశీలించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



సమాధుల తోటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చదలవాడ

నరసరావుపేట: మనిషి ఎంత సంపాదించినా, ఎంత ఎదిగినా చివరికి చేరేది శ్మశానానికేనని, అటువంటి ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. బుధవారం పట్టణంలోని క్రైస్తవుల సమాధుల తోటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతిచెందిన వారిని గౌరవించుకోవడం మన సాంప్రదాయమని, అలాంటి ప్రాంతంలో సమస్యలు రాజ్యమేలితే ఉపేక్షించబోనన్నారు. అధికారులను వెంట బెట్టుకుని వెళ్లి అక్కడి పరిస్థితుల్ని తెలుసుకున్నారు. చివరి మజిలీ సంతోషకరంగా సాగినపుడే ఆ కుటుంబాలకు మనశ్శాంతి ఉంటుందన్నారు. సదుపాయాల కల్పన విషయంలో ఎలాంటి జాప్యాన్ని ఉపేక్షించేది లేదన్నారు. శ్మశాన వాటికలకు వచ్చే వారికి ఆహ్లాదకరమైన పరిస్థితి కల్పించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రరెడ్డి, టీడీపీ నాయకులు కొట్టా కిరణ్, పెరికల రాయప్ప, క్రాంతి పాల్గొన్నారు.

ఉర్దూ బోధనా పరికరాలు ఆవిష్కరణ

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రంలో మైనార్టీ విద్యార్థుల సంక్షేమానికి, ఉర్దూ బాషాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. రియాసతి ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన ఉర్దూ విద్యా బోధనకు అవసరమైన టీచింగ్ ఎయిడ్స్‌ను బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు తన కార్యాలయంలో ప్రారంభించారు. ఉర్దూ పాఠశాలల్లో సమస్యలు, ఉర్దూ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకవచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ఎం.సుభానీ, మోహిద్దీన్, రాష్ట్ర అదనపు ప్రధానకార్యదర్శి ముజీబ్‌షాహీ పాల్గొన్నారు.

ఆక్రమణలపై కన్నెర్ర

నరసరావుపేట టౌన్ పట్టణంలోని అరండల్ పేటలో మున్సిపల్, పట్టణ ప్రణాళిక విభాగ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం రోడ్డు ఆక్రమణలను తొలగించారు. బ్యాంక్ స్ట్రీట్, మోర్ సెంటర్‌లలో కొంతమంది వ్యాపారులు రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. ఈ విషయంపై ఫిర్యాదులు అందటంతో పోలీస్, మున్సిపల్ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఆక్రమణలు తొలిగింపచేశారు. సీఐ విజయ్ కిరణ్, టౌన్ ప్లాన్ సిబ్బంది పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్ పనులు పరిశీలించిన కేంద్ర బృందం



రూఫ్ వాటర్ హార్వెస్టింగ్‌ను పరిశీలిస్తున్న బృందం

రొంపిచర్ల: జలశక్తి అభియాన్ కింద రొంపిచర్ల గ్రామంలో నిర్మించిన మంచినీటి చెరువును కేంద్రం నోడల్ అధికారి కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సోల్మాన్ ఆరోక్య రాజ్ బుధవారం సందర్శించారు. క్షేత్ర పరిశీలనలో భాగంగా రొంపిచర్లలో జలజీవన్ మిషన్ అమలు తీరును పరిశీలించారు. అలాగే మంచినీటి చెరువు, అనుబంధ పనులను పరిశీలించారు. అలాగే ఉపాధి హామీ పథకం కింద గ్రామంలోని ప్రాథమిక వైద్యశాల ప్రాంగణంలో నిర్మించిన నీటి సంరక్షణ పనులైన ఇంకుడు గుంత నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం వైద్యశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. వైద్యశాలను పరిశీలించి అక్కడ రోగులకు అందే వైద్యసదుపాయాలపై పరిశీలించారు. జిల్లా కలెక్టర్ పి. అరుణ్ కుమార్, సెంట్రల్ భూగర్భ శాఖ అధికారి టి. మాథవ్, డ్వామా పీడీ జి.జోసఫ్ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్.ఇ. సురేష్ కుమార్, జిల్లా భూగర్భ నీటి అధికారి టి.ఎస్. శర్మ, ఏపీడీ ఏ. సుధాకర్, మండల పరిషత్ అధ్యక్షురాలు గడ్డం బాలనాగమ్మ, ఎండీవో లక్ష్మీకుమారి, తహసీల్దార్ అంకారావు, డాక్టర్ పి. జగన్ నరసింహారెడ్డి, పలువురు అధికారులు పాల్గొన్నారు.